విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు,సోమవారం 01,ఏప్రిల్ 2024

కోడ్ ఉల్లంఘనపై కొరడా- ఎం.సి.సి.ఉల్లంఘనపై రూ. 2.49 కోట్లు సీజ్

విశాలాంధ్ర-నంద్యాల: మార్చి 16న ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుండి ఇప్పటివరకు (31వరకు) జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై రూ. 1.74 కోట్ల నగదు, రూ.59 లక్షల మద్యం, రూ.16 లక్షల వస్తువులు మొత్తం రూ.2.49 కోట్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పరుస్తున్నామని, ఎం.సి.సి. ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు ఎలాంటి కార్యక్రమాలకైనా ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. సువిధా యాప్ ద్వారా అనుమతులు మంజూరు చేయ డం, సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి 100 నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎఫ్.ఎస్.టి., ఎస్.ఎస్.టి., పోలీసు ఎన్ఫోర్స్మెంట్ టీమ్స్ ద్వారా సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ పటిష్టంగా చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. సామాన్య ప్రజలు, వ్యాపారస్థులు ఎన్నికల దృష్ట్యా ఇబ్బందులు పడకుండా క్రింది సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. రూ.50వేలు అంతకు మించి నగదు తీసుకొని వెళ్లే వారు సంబంధిత రశీదు మరియు ఆధారాలు వెంట తీసుకొని వెళ్లగలరని, విలువైన వస్తువులు, వ్యాపార పరమైన వస్తువులు, సరుకులు తీసుకొని వెళ్ళేటప్పుడు వాటికి సంబంధించిన రశీదు తప్పకుండా తీసుకోవాలని, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు జప్తు చేసిన నగదు, విలువైన వస్తువులు తమకు చెందినదేనని ధృవీకరిస్తూ సంబంధిత అన్ని ఆధారాలతో నిరూపించగలిగితే క్రింది విధంగా వాటిని తిరిగి మరలా పొందవచ్చన్నారు. జిల్లా ప్రజలందరూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నన్ని రోజులపై సూచనలు పాటిస్తూ జాగ్రతగా వుండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్య పట్టించుకోని అధికార పార్టీ నాయకులు

విశాలాంధ్ర-చాగలమర్రి : నియోజకవర్గం లోని గ్రామాలలో తాగునీటి సమస్యను అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడంలేదని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ ఆరోపించారు. ఆదివారం స్థానిక చిన్న మకానం కాలనీ, శివాలయం కాలనీలలో ఆమె బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆపార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్‌భాష ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కాలనీలలోఇంటింటి కెళ్ళి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న ఎమ్మెల్యే హోదాలో ఉండి అధికారులతో సమావేశము ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. తాగునీటి సమస్య నెలకొన్న గ్రామాల్లో అధికారులతో సమావేశం నిర్వహించి దాని పరిష్కారం కొరకు కృషి చేయలేదన్నారు. పారిశుధ్యం పూర్తిగా లోపించిందని రోడ్లపైనే చెత్త చెదారంతో నిండిపోయిందని ఆరోపించారు. మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, మైనార్టీ నాయకులు హుస్సేన్‌వల్లి, ఎస్ ఎండి రఫీద్దీన్,మాబూ షరీఫ్, ఆలంశ గారి మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయికి చీరలే రక్షణ-వైరస్‌తో దెబ్బతిన్న పంట

విశాలాంధ్ర-చాగలమర్రి : బొప్పాయి పండ్లకు చీరలే రక్షణగా నిలుస్తున్నాయి. చిన్న వంగలి గ్రామంలో 300 ఎకరాల్లో రైతులు బొప్పాయి పంట సాగు చేశారు. వైరస్ వల్ల పంట దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. టన్ను ధర రూ.14 వేలు పలుకుతోంది. ధర ఉన్నా దిగుబడి లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. చెట్లకు ఉన్న బొప్పాయి పండ్లను కాపాడుకోవడానికి రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. బొప్పాయి ఎండ ప్రభావంతో దెబ్బ తింటున్నాయి. దీంతో రైతు బికారి సాహెబ్ పాత చీరలతో 2 ఎకరాల బొప్పాయి తోటను కాపాడుకుంటున్నారు. ఒక్కో చీర రూ.20 ప్రకారం కొనుగోలు చేసి బొప్పాయి కాయలకు చుట్టేశారు. తోటలోని మొక్కలకంతా చీరలు కట్టి పండ్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేశాడు. పండ్లను కోసే వరకు దెబ్బతినకుండా ఉంటాయని రైతు పేర్కొన్నారు. రూ.2 లక్షల దాక ఖర్చు చేశామని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: కడప జిల్లా జమ్మలమడుగు పట్టణం నుండి కోవెల కుంట్లకు ఇసుకతో తరలివెళ్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని పుచ్చకాయలపల్లె మెట్ట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామాంజనేయులురెడ్డి ఆదివారం తెలిపారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన పన్నెగట్ల గౌస్‌బాషా ఇసుకకు సంబంధించి ఎలాంటి రాయల్టీ, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సి లేకుండా అక్రమంగా తరలి స్తుండటంతో డ్రైవర్‌తో పాటు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై స్పష్టం చేశారు.

ఇరువురు మృతి - ఎమ్మెల్యే గంగుల నివాళి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని కాపుపేట పశువుల ఆస్పత్రి కాలనీలో నివసిస్తున్న ఉల్లి తిరిపాలు, నడిపి కులాయప్పా, అను ఇరువురు మృతి చెందడంతో ఆళ్లగడ్డ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి నివాళులర్పించారు. కాపు పేటలో సీనియర్ కార్యకర్తగా ఉంటూ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకుని ఎమ్మెల్యే గంగుల తిరుపాలు భౌతికకాయానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. శిరివెళ్లలోని పసుల హాస్పిటల్ సమీపంలో కులాయప్ప మృతిచెందగా ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఇరువురి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, ఆలయ చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, నాయకులు కార్యకర్తలున్నారు.

సంక్షేమ సారధి కాటసానినీ గెలిపించుకుందాం

విశాలాంధ్ర-పాణ్యం: నియోజకవర్గంలో సంక్షేమం,అభివృద్ధిని పార్టీలకతీతంగా



ప్రజలకు నెరవేర్చిన సంక్షేమసారథి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని కాటసాని మహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఈమేరకు మండల పరిధిలోని మద్దూరు,అనుపూరు, అహల్యాపురం గ్రామాల్లో ఉమామహేశ్వరమ్మ ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు కోరారు.మండలంలోని గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించిన ఘనత ఎమ్మెల్యే కాటసానికి దక్కుతుందన్నారు.గ్రామాల్లో నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు వీరయ్యస్వామి, నారాయణస్వామి, శరభయ్యస్వామి, శ్రీనివాసులు, వెంకట సుబ్బయ్య, ప్రదీప్‌రెడ్డి,సుమంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి,జయచంద్రారెడ్డి, ఎంపీపీ హుస్సేన్ బి, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే.. ప్రయాణాలు సాగేదెలా..!

విశాలాంధ్ర-బనగానపల్లె: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా చెత్త కుండీ లేకపోవడంతో ఇంటిలోని వ్యర్థాలు, మెడికల్ షాప్ దుకాణదారులు షాప్‌లోని వ్యర్థాలు రహదారిపై పడేస్తున్నారు. దీంతో రహదారిపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చెత్త కుండీని ఏర్పాటు చేయవలసిందిగా వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

ముస్లిం సోదరుల అభ్యున్నతికి కృషి

విశాలాంధ్ర-అవుకు: ముస్లిం సోదరుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మసీదులో పవిత్రమైన రంజాన్ మాసంలో దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఈ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైసీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాలు రెడ్డి, మాజీ ఉపసర్పంచు రవీంద్రనాథ్‌రెడ్డి, మెట్టుపల్లి ఉప సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, కాంట్రాక్టర్ మద్దయ్య, జిల్లా బీసీ సంఘం నాయకుడు వాయినందునగౌడ్, అడ్వకేట్ గణేష్, చర్లోపల్లి సుబ్రహ్మణ్యం, సింగనపల్లి పుల్లారెడ్డి,మత పెద్దలు జిలాని, వలి, మత్తేసా, దస్తగిరి, షఫీలు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: గత ఏడాది రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. వేసవికాలంలో నీటి ఎద్దడి ఇబ్బందులు తప్పవని గమనించి ముందు చూపుతో గ్రామస్తులు స్పందించారు. మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో సమీపంలో ఉన్న కుంటను గత ఏడాది నవంబర్ నెలలో కేసీ కెనాల్ నీటితో నింపుకున్నారు. నీటితో నింపడమే కాకుండా గ్రామస్తులు ప్రత్యేక పైప్లైన్ ఏర్పాటు కోసం మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు నీటి సరఫరా చేసి సమస్యకు పరిష్కారంకు కృషి చేశారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధప్రాతిపదికన మండల పరిషత్ నిధుల నుండి రూ.3.40 లక్షలు వ్యయం చేసి విద్యుత్ మోటార్, పైపులైన్ కుంట నుండి గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ట్యాంకును నీటితో నింపి గ్రామంలో కుళాయిలకు సరఫరా చేస్తున్నట్లు ఏఈ ఫణిత్ కృష్ణ తెలిపారు. ఎంపీపీ భాగ్యమ్మ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయడంపై సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు శివమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

ఫించన్ల సొమ్మును కాంట్రాక్టర్లకు ఊడ్చిపెట్టిన జగన్‌రెడ్డి

విశాలాంధ్ర-బనగానపల్లె: బనగానపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యో గుల ద్వారా ఫించన్లు ఒకటో తారీఖున వారి ఇంటికి చేర్చేందుకు జగన్ రెడ్డి ప్రభు త్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని బీసీ టీడీపీ డిమాండ్ చేశారు. ప్రతినెల 1న పెన్షన్లకు ఇవ్వాల్సిన డబ్బును జగన్‌రెడ్డి తన అనుకూల కాంట్రాక్టర్లకు మొత్తం ఊడ్చిపెట్టాడంతో దీంతో పింఛన్ల సొమ్ములు ఇవ్వడానికి నేడు ఖజానాలో సరిపడా డబ్బులు లేకుండా పోయాయన్నారు. ఎన్నికల కమిషన్లపైనా, నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పై దుష్ప్రచారానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. పింఛన్ దారుల పట్ల వైసీపీకి ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా ఖజానాలో ఉన్న డబ్బు కాంట్రాక్టర్లకు దోచి పెట్టేవాడు కాదని, పించన్లకు నిధుల కొరత పెట్టేవాడు కాదని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామకార్యదర్శులతో ఫించన్లు పంపిణీ చేయించక పోవడానికి కారణం నిధులు కొరతే గాని ఎన్నికల కమీషన్ కాదు తెలియపరిచారు. వైకాపా కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రజాసేవ మాత్రమే చేసే వాలంటీర్లను రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగుస్తుంది. పింఛన్ దారులకు రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం నెలకు నాలుగు వేల రూపాయల పెన్షన్లు ఇంటి వద్దకే పంపిణీ చేస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారని బీసీ గుర్తు చేశారు.

పసిపిల్లల మరణాలపై చర్యలేవి-సీపీఐ

విశాలాంధ్ర-బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచర్ల పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం ప్రసవ సమయంలో మగ శిశువు మృతి చెందాడని విషయం తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎల్లకృష్ణలుమాట్లాడుతూ మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన గర్భిణీ మహిళ ప్రసవం నిమిత్తం సుమారు మూడు రోజుల కిందట బేతంచెర్లలోని శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో చేరడం జరిగిందని,స్థానిక డాక్టర్ల నిర్లక్ష్యం కారణం వల్ల మగ శిశివు మరణనించడం దురదృష్టకరమని ఈఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్చి 13న శిశువు మృతి చెందిన ఘటన మరువకముందే అదే పద్ధతిలో మళ్లీ ఆదివారం మగ శిశువు మృతి చెందడం తీరని బాధలను మిగులుస్తుందే తప్ప సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల ప్రాణాలను కాపాడుటకై ఆదుకునే నాధుడు కరువైపోయారు అని విచారం వ్యక్తం చేశారు. ఒకవైపు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టిలో పేద,బడుగు బలహీన, వర్గాల ప్రజల ప్రాణాలకు విలువ లేదా.......?! మీ చావు మీరు చావాల్సిందే అనే నిర్లక్ష్యమా....?! పసిపిల్లల ప్రాణాలని గాలిలో దీపం లాగా ఆర్పేస్తుంటే రాబోయే కాలానికి నవ నూతన భారత నిర్మాణానికి యువత ఎక్కడ నుండి వస్తుంది...?! సమాధానం చెప్పాల్సిన బాధ్యత స్థానిక ప్రజా ప్రతినిధులపై లేదా.అని నిలదీశారు.మార్చి 13వ తేదీన జరిగిన శిశువృతిపై ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఉంటే ఈరోజు ఈ మరణం సంభవించేదా..?! శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో జరుగుతున్న శిశు మరణాలపై కమిటీ వేసి పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసి తక్షణమే సస్పెండ్ చేయాలని, స్పందించిన స్థానిక నాయకులపై అక్కడే వైద్యశాలలో ఉన్న డాక్టర్ చరణ్ రాజ్ దురుసుగా ప్రవర్తించి నోటికి వచ్చినట్లు అసభ్య పదజాలంతో పురుష అహంకారాన్ని చూపిస్తూ నన్ను ఎవరు ఏమి చేసుకోలేరు నాకు నాయకులు అండ పుష్కలంగా ఉంది మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అనటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ నందు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తక్షణమే డాక్టర్ చరణ్ రాజు పై క్రిమినల్ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ మండల నాయకులు మధు, శ్రీకర్, దిలీప్, ప్రదీప్, శరత్ ,మారుతి ,శ్రీకాంత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయం- శిల్పా పోల్పాకు అడ్డుకట్ట వేద్దాం

విశాలాంధ్ర - నంద్యాల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన పరిపాలన తప్పులే ఆయన మెడకు చుట్టుకొని ఈ సాధారణ ఎన్నికల్లో ఓడిపోతున్నాడని, జగన్‌ను ఓటమి భయం వెంటాడుతోందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జోష్యం చెప్పారు. ఆదివారం నంద్యాలలో ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌లు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.ఈసందర్భంగా వారుమాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలం అయిందని, సీఎం జగన్ అనాలోచిత నిర్ణయాలతోనే రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్ళు వెనక్కు వెళ్లిందని, రాజధాని లేని రాష్ట్రంగా నిలిపారని విమర్శించారు. జగన్ కు ఓటమి భయం పుట్టుకుందని, ఈ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం కూలిపోతోందని, దేశంలో, రాష్ట్రంలో ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని, బాబు మళ్ళీ సీఎం అవబోతున్నారని పేర్కొన్నారు. డబ్బు, అహంకారంతో శిల్పా కుటుంబం శిల్పా పోల్పా అంటూ విర్రవీగుతున్నారని, శిల్పా పోల్పాకు నంద్యాల-శ్రీశైలం నియోజకవర్గం ప్రజలే అడ్డుకట్ట వేయబోతున్నారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీలుగా టీడీపీ అభ్యర్థులు గెలుపొందడం తథ్యమని జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ జోస్యం చెప్పారు. మాజీ రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ ఎవి సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు తాతిరెడ్డి తులసిరెడ్డి, ఏవిఆర్ ప్రసాద్ లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కె. శివ నాగిరెడ్డి, టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - నంద్యాల : సార్వత్రిక ఎన్నికలు -2024 కు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 నిత్యావసర సేవలు అందించే శాఖలకు చెందిన వారికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ విభాగాల్లో విధుల్లో ఉంటూ పోలింగ్ రోజు ఓటు వేయలేని 33 శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని, ఈ అవకాశాన్ని అర్హులైన ఆయా విభాగాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో జిల్లాలో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అర్హతవున్న విభాగాల వివరాలను వెల్లడించింది. ఇందు కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్ కి సంబంధించి ఫారం 12 డి లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఇందుకోసం జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా ఏపీఎంఐపీ పిడి శివ సత్యనారాయణ, సహాయ నోడల్ అధికారిగా డిపిఓ మంజులవాణిని నియమించడం జరిగిందన్నారు. సదరు నోడల్ అధికారులు సంబంధిత ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి తెలియజేస్తారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించిన విభాగాలలో మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు రవాణా) సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి కమిషన్ ఆమోదంతో అధికార లేఖలు జారీ పొందిన మీడియా వ్యక్తులు, విద్యుత్ శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో.ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ,ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్మెంట్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్ని మాపక సేవలు,ట్రాఫిక్ పోలీస్,అంబులెన్స్ సేవలు, షిప్పింగ్,ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్ శాఖ, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీస్, అటవీశాఖ, సమాచార, ప్రజాసంబంధాల శాఖ, పోలీసు, పౌర రక్షణ, హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు - వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ (పవర్), ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడి, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్,విపత్తు నిర్వహణ శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిఘా పెంచిన పోలీసులు-ముమ్మర తనిఖీలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయాగ్రామాల్లో పోలీసులు నిఘా పెంచారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.మండల పరిధిలోని యర్రగుంట్లలో సీఐ చంద్రబాబు 40 వ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేసి వాహన డ్రైవర్లకు పలుసూచనలు సలహాలుఅందించారు.ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం ఇతరత్రా తరలించే వారిపై నిఘాను పెంచామన్నారు. ముఖ్య కూడళ్లలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పాటు బందోబస్తు నిర్వహిస్తున్నట్లూ తెలిపారు.కార్లు, జీపులు, క్రూయిజర్లు, ఆటోలు, ట్యాక్సీలు, డీసీఎంలు, ట్రాలీ ఆటోలు తదితర ప్రైవేట్ వాహనాలను చెక్ చేశారు. వాహనాలలో రశీదులు లేకుండా వాహనాల్లో తరలించే డబ్బులు, ఇతర వస్తువులపై పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని పూర్తి స్థాయిలో తనిఖీ చేస్తున్నట్లు సీఐ చంద్ర బాబు తెలిపారు.

ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీ

ఆత్మకూరు టౌన్‌: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషన్ మొదలైన అందువలన ఆత్మకూరు పట్టణ డీఎస్పీ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద బిఎస్ఎఫ్ జవాన్లతో కలిసి వాహనాలను ఎస్సై నారాయణరెడ్డి తనిఖీలు చేపట్టారు.

పలువురు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండలంలోని బందర్ల పల్లె గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో ఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన 25 వైసిపి కుటుంబాలు బనగానపల్లి కి వెళ్లి బీసీ సమక్షంలో టిడిపిలో చేరారు. ఏ భాస్కర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, భారతి, అరుణాదేవి, మల్లికా దేవి, పుష్పావతి, వలి,శుకూర్ బాషా,ముక్కల వెంకట్ రాముడు,గోగుల రామచంద్ర, సిద్దయ్య, బోయ రఘురాం తదితర 25 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి కండువా కప్పుకున్నారు. రెండు రోజుల క్రితం ప్రభావతి సిద్దయ్య గోగుల చంద్ర వైసీపీలో చేరి తిరిగి టిడిపి చేరారు.పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని, ఊర్లోని టిడిపి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని అందరికీ సంక్షేమం అభివృద్ధి ఫలాలను అందిస్తామని మాజీ ఎమ్మెల్యే బీసీ తెలిపారు.

మాండ్ర సమక్షంలో టిడిపిలో చేరికలు

విశాలాంధ్ర-నందికొట్కూరు : నియోజకవర్గపరిధిలోని కొత్తపల్లి మండలం, గువ్వల గుంట్ల పంచాయతి బండినేనిపాలెం, వైసీపీ యువకులు ఆదివారం అల్లూరులో టీడీపీ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో నారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మాండ్ర వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.వెంకటరెడ్డి, శివలింగం, శంకర్, లక్ష్మన్న, మాణిక్యరావు, సత్యరాజు, రామచంద్రుడు, మధు,లింగస్వామి, రాముడు, వెంకటరమణలుచేరారు.

నిమ్మతోట, కొబ్బరి చెట్లకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోండి

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్‌: నిమ్మతోట, కొబ్బరి చెట్లు అగ్ని ప్రమాదంలో



కాలి పోవడంతో రూ.3 లక్షలు నష్టం జరిగినట్లు రైతు భరోసా కేంద్రం చైర్మన్ బైరాపురం మహబూబ్ బాషా పేర్కొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని వడ్ల రామాపురం వెళ్లే దారిలోని నిమ్మ తోట, కొబ్బరి చెట్లు ఉన్నాయి. ఆదివారం అకస్మాత్తుగా మంటలు చెలరేగి దాదాపు 100 చెట్లు పైగా కాలిపోయాయన్నారు. పట్టణానికి చెందిన కౌలు రైతు భైరాపురం షేక్ సలావుద్దీన్ సాగు చేస్తున్నాడని, దాదాపు రూ.3 లక్షల దాకా నష్టపోయాడని తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారము ఇవ్వాలని కోరారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ



విశాలాంధ్ర-బనగానపల్లె: పట్టణంలోని కొండపేట ఏరియాలోనిచార్‌కమాన్ మస్జిద్ ముజీబ్, హాజీ, షారుక్, ఫైరోజ్‌ఖాన్‌లు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చార్ కమాన్ మస్జిద్ పేష్ ఇమామ్‌ను బీసీ జనార్ధన్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, ముస్లిం మైనార్టీ నియోజవర్గ అధ్యక్షులు సలాం, పట్టణ అధ్యక్షుడు ఖాసింబాబు,అల్తాఫ్, కలాం, ముస్లిం పెద్దలు, టీడీపీ మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.

ఇస్కాల, బానుకచెర్లలో డా.సుధీర్ పర్యటన

విశాలాంధ్ర - పాములపాడు : మండలంలోనిఇస్కాల, బానకచర్ల గ్రామాల్లో నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ధార సుధీర్ పరిచయ కార్యక్రమాన్ని మండల వైసీపీ అధ్యక్షులు రామలింగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ అధికారపార్టీ వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ మరోమారు అవకాశం ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో బాల్కచర్ల, ఇస్కాల, తుమ్మలూరు సర్పంచులు ఆవుల జయసుధ,మౌలాలి, వరప్రసాద్, ఏవిఎస్‌రెడ్డి, వైసీపీ నాయకులు చౌదయ్య, మధుసూదన్ రావు, నరసింహులు. ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్బరాయుడు హుండీ ఆదాయం 12.60 లక్షలు



విశాలాంధ్ర-పాణ్యం: ప్రముఖ శైవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన హుండీ లెక్కింపు ద్వారా రూ.12,60,950ల నగదు,12.300 గ్రాముల బంగారం,1.102 కిలోల వెండి ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. ఈవో రామకృష్ణ మాట్లాడుతూ జనవరి 25 నుండి మార్చి 30 వరకు ఈఆదాయం సమకూరిందన్నారు.

వెండి,బంగారు నాగ పడిగే విరాళం : శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి భక్తులు వెండి,బంగారం నాగ పడిగేలను ఆదివారం దాతలు కడప జిల్లా దువ్వూరు మండలం కృష్ణంపల్లెకు చెందిన పోతేన హరికృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులు 1.0025 కిలోల వెండి నాగపడిగే, అవుకు మండలం చెన్నంపల్లెకు చెందిన యాదాటి వీరశేఖర్‌రెడ్డి 6 గ్రాముల బంగారం నాగపాడిగెను వితరణ చేసినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. దాతలకు ఆలయం మర్యాదలతో అభిషేకాలు, అర్చనలు,విశేష పూజలు నిర్వహించి ప్రసాదములు అందజేశారు.

భక్తుల సౌకర్యార్థం కోసమే వైద్యశిబిరం

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : ఉగాది సందర్భంగా వెళ్ళు కన్నడ మరియు మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ నుండి పాదయాత్రతో బయలుదేరు భక్తులకు వైద్యసాయం అందించుటకు మెడికల్ క్యాంపులను జిల్లా కలెక్టర్ డా.కే.శ్రీనివాసులు, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఆర్ వెంకటరమణల ఆదేశాల మేరకు వైద్యాధికారి సిబ్బందితో కలిసి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఆదివారం డా. ఆర్.వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్ళు భక్తులకు తమతోపాటి ఓఆర్ఎస్ కలిపిన ద్రావణాన్ని తమ వెంట తీసుకు వెళ్లాలని,టోపీని ఎండతగలకుండా ఉపయోగించాలని అత్యవసర సమయాల్లో 108 ను ఉపయోగించాలని ఎవరైనా భక్తులు బిపి షుగర్ మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధులు కలవారు తమరి వెంట వ్యాధికి సంబంధించిన మాత్రలను తీసుకెళ్లాలని సూచించారు. డా.జి పవన్ కుమార్ మెడికల్ ఆఫీసర్ పిహెచ్సి బైర్లూటి,సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య, సిహెచ్‌ఓలు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులను విస్మరించిన నాయకులకు బుద్ధి చెబుతాం..!

విశాలాంధ్ర -కోవెలకుంట్ల: దళితులైన మాల మాదిగ వాటి ఉపకులాలకు సంబంధించిన ఎస్సీలు ఇకనుండి మేల్కొనవలసిన అవసరం ఎంతైనా ఉందని మన ఓట్లు దండుకొని గొప్పవాళ్ళు అవుతున్నా రాజకీయ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉందని నంద్యాల జిల్లా నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు దేవరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా దళితులు దగా పడుతున్నారని దళితులకు సంబంధించినటువంటి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని విషయం దళితులకు ఇంతవరకు తెలియదన్నారు. రాజశేఖర్ రెడ్డి హయాం నుండి ఇంతవరకు కూడా దళితులకు సంబంధించిన సబ్ ప్లాన్ నిధులు 20 సంవత్సరాలుగా దళితులకు ఖర్చు పెట్టకుండా పక్కదారి పట్టిస్తున్నారన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు,సోమవారం 01,ఏప్రిల్ 2024

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం..!

సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

విశాలాంధ్ర- దేవనకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలలో బిజెపి, వైసీపీ,టీడీపీ, జనసేన, పార్టీలకు చెందిన అభ్యర్థులను రాష్ట్రం నుంచి తరిమికొట్టి, ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి రాష్ట్రాన్ని దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆదివారం దేవనకొండ సీపీఐ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసరావు అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఈసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు గత ఎన్నికల కంటే భిన్నమైనవని, ప్రధానంగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సమైక్యత, సమగ్రత,లౌకికవాదం ప్రధానమైన హక్కులు హరించే పద్ధతులలో పరిపాలన కొనసాగిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుల మతాలను రెచ్చ గొట్టి గొడవలు సృష్టించి పరిపాలన కొనసాగిస్తున్నారనిమతోన్మాదాన్ని రెచ్చగొట్టి మెజార్టీగాఉన్న హిందువుల ఓట్లను కొల్లగొట్టి తిరిగి అధికారం లోకి రావాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని బిజెపి ప్రభు త్వానికి ఎదురు తిరిగి మాట్లాడితే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే పద్ధతుల్లో సిబిఐ,ఈడి,లను పెంపుడు కుక్కల వల్లే వాడుకొని వ్యవస్థలను దుర్వినియోగంచేస్తూ, ప్రతిపక్ష పార్టీల నాయకులపై, ముఖ్యమంత్రులపై అక్రమకేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధానమైన ప్రభుత్వ రంగ సంస్థలైన టెలికాం ఎల్ఐసి రైల్వే చివరికి అంతరిక్ష పరిశోధన కేంద్రాలను కూడా కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన ఏఒక్క వాగ్దానం చేయలేక ప్రతి ఏడాది యువజనలకు 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 100 రోజుల్లో అధిక ధరలు తగ్గిస్తామని, ఇతర దేశాల్లోని నల్లధనాన్ని రప్పించి పేద బడుగు బలహీన వర్గాల ప్రజల బ్యాంకు అకౌంట్లో జమ చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి జరగబోవు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలోకొస్తే ఐదేళ్లలో ప్రజలపై భారాలు మోపనని వాగ్దానం చేసి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన వై.ఎస్.జగన్‌రెడ్డి ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచారని,నాలుగుసార్లు ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచారని, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచారని,నగరాల్లో పట్టణాల్లో ఇంటి పన్నులు, నీటిపన్నులు పెంచి కొత్తగా చెత్త పన్ను కూడా వేశారని, సంక్షేమం పేరుతో 10 రూపాయలు ఇచ్చి 100 రూపాయల ప్రజల దగ్గర నుండి గుంజుతున్నారని,రాష్ట్రప్రయోజనాలను గాలికొదిలేసి అవినీతి కేసుల కోసం అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు వైఎస్ జగన్ రెడ్డి,చంద్రబాబు నాయుడు నరేంద్ర మోడీ కాళ్ల కింద మోకరిల్లారని దీని కారణంగా ఈ రాష్ట్రానికిఅన్యాయం జరుగుతుందని, అన్యాయం చేసిన బిజెపితో పరోక్షంగా,ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకుని అంటగాగుతున్న వైసీపీ,టీడీపీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, ఓడించి, ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న అసెంబ్లీ,లోక్సభ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంనబి రసూల్.కే మద్దిలేటి శెట్టిడి,రాజాసాహెబ్,సీపీఐ జిల్లాసమితి సభ్యులు కృష్ణయ్య, సయ్యద్ సుల్తాన్ సాహెబ్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ,రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు కండప్ప, సీనియర్ నాయకులు తిమ్మప్ప, సీపీఐ మండల నాయకులు ఈరన్న,రాజన్న, మహేశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు

ముగ్గురు మహనీయుల వారసుడిగా గామాగో

- నిరంతర పోరాటయోధుడు ఎం వి సుబ్బారెడ్డి
- ఉద్యమ స్ఫూర్తి నింపే శక్తి ఉన్న మహనీయుడు గోమాగో
- గామాగో ఆత్మకథ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజనేయులు

విశాలాంధ్ర-కల్లూరు: ముగ్గురు మహనీయుల వారసుడిగా గోమాగో ఎన్నో అలుపెరుగని పోరాటాలు చేసి నేటి, రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు గోమాగో అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజనేయులు, పలువురు రచయితలు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం అభ్యుదయ రచయితల సంఘం కర్నూలు శాఖ ఆధ్వర్యంలో సీ.క్యాంప్ సెంటర్‌లోని లలిత కళాసమితిలో ప్రముఖ కథా రచయిత డా.ఎం.హరికిషన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అతిథులుగా డా.కె. చంద్రమౌళి,సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పుస్తకావిష్కరణ చేశారు. పత్తి ఓబులయ్య, చంద్రశేఖర కల్కూర, రాయపాటి శ్రీనివాస్ ,పాణ్యం నాగార్జున, గద్దం అమర్నాథరెడ్డి, జంధ్యాల రఘుబాబు, పుల్లారామాంజనేయులున్నారు. ఏపీచరిత్రలో గామాగో ఆత్మకథకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎవరికీ తెలియని బనగానపల్లె సంస్థాన స్వాతంత్ర పోరాటాన్ని ఇనాం భూముల రద్దు కొరకు జరిగిన కరివేన సత్యాగ్రహాన్ని క్షుణ్ణంగా మొదటిసారి రికార్డు చేసిన పుస్తకం అన్నారు. 1918 -2022ల మధ్య జరిగిన భారతీయ రాజకీయాలను ఆంధ్ర దేశం మీద వాటి ప్రతిఫలాలను ఆనాటి కుటుంబ పోషణపై ప్రభావం చూపిన ముగ్గురు మహనీయులు గాంధీ, మార్క్స్, గోర పేర్లలోని మొదటి అక్షరాలను స్వీకరించి తన పేరును గామాగో అని మార్చుకున్నాడని డా.ఎం.హరికిషన్‌తెలిపారు.కామ్రేడ్‌కె.రామాంజనేయులు మాట్లాడుతూ గామాగోకు వ్యక్తిత్వం, ఆలోచనలో నిజాయితీ, ఆచరణలో నిబద్ధత, నెవ్వెర పరుస్తాయని ఆయన శక్తిసామర్థ్యాలకు విస్తు పోతామన్నారు. ఉద్యమం ఎలా నడపాలో వారి ఆత్మకథ చదివితే తెలుస్తుంది అన్నారు. తెలుగు భాషోద్యమ నేత జె.ఎస్.ఆర్.కె శర్మ పుస్తక సమీక్ష చేస్తూ..చేతిలో చిల్లిగవ్వ లేకున్నా గుండెనిండా ఆశయ స్ఫూర్తి నింపుకొని అప్పటికప్పుడే అక్కడికక్కడే సైన్యాలను సమకూర్చుకొని సమరంలో దూకి విజేతగా తిరుగుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. రాజకీయ పాఠశాలలు నడపడం, అక్కడ తయారైన కార్యకర్తలను అత్యంత క్రియాశీలకంగా ప్రజా ఉద్యమాలలో, సత్యాగ్రహాలలో పాల్గొనేలా చేయడం ,ఆయన కార్యనిర్వహణ దీక్షకు అద్దం పడతాయన్నారు.ప్రముఖ కథా రచయిత జి.ఉమా మహేశ్వర్ పుస్తక సమీక్ష చేస్తూ..క్విట్ ఇండియా ఉద్యమం మొదలుకొని చివరి రోజులలో రైతు చైతన్య సభల వరకు కరివేనా ఇనాం భూముల సత్యాగ్రహం నాయకుల ద్వంద వైఖరులను కళ్ళకు కట్టినట్లు వివరిస్తుంద పేర్కొన్నారు. ఆచరణ వాది, నిస్వార్ధ ప్రజా నాయకుడు, నిరంతర పోరాట యోధుడు అయిన ఎం.వి సుబ్బారెడ్డి నాస్తికునిగా మారాకకులమత ప్రాంతాలను సూచించకుండా ఆయన నుండి కాసా సామాజిక అభివృద్ధి కార్యక్రమాల వరకు అలుపెరుగని అవిశ్రాంత పోరాటాలు చేసిన రాజకీయ యోధుడు ఒక ఉద్యమాన్ని నడపడంలోని వివిధ దశలను కూలంకషంగా అర్థం చేసుకొని సమర్థవంతంగా నిర్వహించిన వైనం కరివేన సత్యాగ్రహంలో గమనించవచ్చన్నారు.పత్తి ఓబులయ్య, చంద్రశేఖర కల్కూర , పాణ్యం నాగార్జున , గద్దం అమరనాథరెడ్డి, పుల్లారామాంజనేయులు మాట్లాడుతూ1942 క్విట్ ఇండియా ఉద్యమంలో గామోగో పాల్గొన్నారు. మద్రాసు సిటీ కాలేజీలన్నిటిలోని విద్యార్థులు కాలేజీల్లోని ఆవరణలో గుమికూడి జాతీయ గీతాలైన వందేమాతరం జనగణమణ ఆలపించడం బ్రిటీష్ సామ్రాజ్య అంతరించాలని నినాదాలు చేయడం. జాతీయ నాయకులందరూ విడుదల అయ్యేంత వరకు నిరువధిక సమ్మె చేసేవారన్నారు. గామాగోతో తమకున్న అనుబంధం గురించి, వారి విశిష్ట వ్యక్తిత్వం గురించి వారితో అత్యంత సన్నిహితంగా మెలిగిన శ్రీనివాసరావు , భార్గవ వివరించారు. గామోగో ఈ దేశానికి చేసిన సేవకుగాను గౌరవంతో, అభిమానంతో గామాగో కుమార్తె ముక్కమల్ల ధరిత్రీదేవిని ప్రసిద్ధ రచయిత్రులు, నగర ప్రముఖులు డా.దండబోయిన పార్వతీదేవి, ఎస్.నాగమణి, కల్యాణ దుర్గంస్వర్ణలత, జంగం స్వయంప్రభ, డా.కె.చంద్రమౌళిని, హరిసింహనాయుడు, డా.చిన్నావుల రాజారెడ్డి, గౌరెడ్డి హరిశ్చంద్రా రెడ్డిలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం అభ్యుదయ రచయితల సంఘం కర్నూలు జిల్లా శాఖ సభ్యులయిన రాణి లీలావతి, ప్రమోద్ చక్రవర్తి, సయ్యద్ జహీర్ అహమ్మద్, రాజా రమేష్, రేవుల శ్రీనివాసులు నిర్వహించారు.

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థిపై కత్తితో దాడి

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థుల మధ్య గొడవ

విశాలాంధ్ర-పత్తికొండ: స్థానిక ఏపీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిపై అదేతరగతికి చెందిన విద్యార్థి కత్తితో దాడి చేసిన సంఘటన పత్తికొండలో చోటుచేసుకుంది. ఏపీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో పెద్దహుల్తికి చెందిన ధనుష్ అనే విద్యార్థిపై అదే తరగతికి చెందిన విద్యార్థి కత్తితో దాడి చేయగా మోచేతికి తీవ్రంగా గాయం కావడం జరిగింది. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటూ, మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించడం జరుగుతుంది. దీనికి వ్యతిరేకంగా పత్తికొండ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపం కారణంగా విద్యార్థులు తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ ఘర్షణలకు పాల్పడుతూ ఒకరిపైఒకరు దాడులు చేసుకుంటున్నారనీ, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థుల తల్లి,దండ్రులు మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్ నాశనం కాకుండా, సంబంధిత శాఖ అధికారులు న్యాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

దూదేకులకు న్యాయం చేస్తాం- టీడీపీ అభ్యర్థి టి.జి భరత్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక దూదేకుల కులస్థులకు అన్ని విధాలా న్యాయంచేస్తామని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి.జి.భరత్ అన్నారు. నగరంలోని మౌర్య ఇన్‌లో దూదేకుల కులసంఘం పెద్దల ఆత్మీయ సమావేశంలో టి.జి భరత్ పాల్గొన్నారు. సంఘం పెద్దలు వారి సమస్యలను టి.జి భరత్‌కు తెలియజేశారు.అనంతరం టి.జి.భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అన్ని కులాలు, మతాలకు న్యాయం చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత సమస్యలను క్రమపద్ధతిలో పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అధికారం చేపట్టబోయేది తామేనని కర్నూల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు దూదేకుల కులస్థులు ముందుకు రావాలని కోరారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే సమస్యలను చంద్రబాబు, లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. గతంలో శంకుస్థాపనతోనే ఆగిపోయిన దూదేకుల కులస్థుల కమ్యూనిటీ హాల్‌ను తాను గెలిచిన తర్వాత పూర్తి చేసేందుకు కృషి చేస్తానని భరత్ హామీ ఇచ్చారు. తనపై నమ్మకం పెట్టుకొని కుల,మతాలకు అతీతంగా గెలిపించాలని ఆయన కోరారు. 25 రోజులుగా కర్నూల్లో వైసీపీ నేతలు ప్రజాసేవ చేసామని ప్రచారాలు చేస్తున్నారన్నారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటూ నిస్వార్థంగా తాము ప్రజలకు సేవ చేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. మాయమాటలు చెప్పే వైసీపీ నేతలను నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో దూదేకుల కులస్థులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర- జిల్లా పరిషత్తు : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూల్ జిల్లా ఎస్పీజి. కృష్ణ కాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా శాంతిభద్రతలను కాపాడదానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని కర్నూలు, పత్తికొండ సబ్‌డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో కేంద్ర సాయిధ బలగాలైన **'సశస్త్ర సీమా బల్'** సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు.

ఘనంగా బడే రాత్ వేడుకలు

విశాలాంధ్ర-హొళగుంద : రంజాన్ పవిత్ర మాసాన్ని ముస్లిం సోదరులు ఎంతో నియమ నిష్టలతో పాటిస్తారు రంజాన్ నెల అంతా కఠోర ఉపవాసాన్ని పాటిస్తూ ఐదు పూట్ల నమాజుని చేస్తారు రంజాన్ నెలలో ఐదు రాత్రులను ముస్లిం సోదరులు జాగరణ చేస్తూ ఖురాన్ చదవడం నమాజు చేయడం భయాన్ చెప్పడం జరుగుతుంది మసీదులో 21వ రాత్రి మొదటి రాత్రి బడే రాత్రి సందర్భంగా మసీదులను అన్ని రంగులతో ముస్తాబు చేశారు ముస్లిం సోదరుల కోసం రాత్రి పాయాసం, స్వీట్లు పంపిణీ చేశారు ముస్లిం సోదరులతో పాటు మహిళలు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు మసీదులన్నీ ముస్లిం సోదరులతో కిటకిటలాడాయి ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో బడే రాత్ను ఆచరించారు.

పోలింగ్ శిక్షణ తరగతులను డివిజన్ కేంద్రంలో నిర్వహించాలి

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : 2024 ఎన్నికలకు సంబంధించిన శిక్షణ తరగతులు డివిజన్ కేంద్రంలో నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహ దేవప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని, కౌతాళం మండలాలకు సంబంధించిన ఎస్టీయూ ముఖ్య నాయకులు,కార్యకర్తల సమావేశాన్ని ఆదోని మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి మహదేవప్పతోపాటు ఎస్టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న,సీనియర్ నాయకులు వెంకోబా,సత్యాన్న మాట్లాడారు.ఎన్నికల సిబ్బందికి ఎన్నికల పట్ల శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో నిర్వహించడం వలన ఉపాధ్యాయ,ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా నలుమూలల నుండి వ్యాయా ప్రజాసాలు కూర్చి ప్రయాణం చేసి శిక్షణ తరగతులకు హాజరు కావడంతో కొంత మంది వడదెబ్బకు గురై అస్వస్థతకు గురి కావడం జరిగిందని తెలియజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయ,ఉద్యోగుల ను పోలింగ్ విధుల నుండి మినహాయింపు చేయాలని పోలింగ్ రిటర్నింగ్ అధికారులను కోరారు. పోలింగ్ సిబ్బందిని సిక్స్‌ప్లస్ టు ఉండేలా చూడాలని పోలింగ్ రిటర్నింగ్ అధికారులను డిమాండ్ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విధులకు హాజరయ్యే మహిళా ఉద్యోగులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎస్టియు జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు రామకృష్ణ, మండల గౌరవ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి,మండల ఆర్థిక కార్యదర్శి షేక్షావలి కౌతాళం మండల నాయకులు అంజనేయ,వెంకటేశులు, భాస్కర్,కోటేశ్వరయ్య తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చలేని ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం- ఎస్టీయూ

విశాలాంధ్ర-కర్నూలు : కర్నూలు : రాష్ట్రంలో ఉన్న 11 లక్షల ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికపెన్షనర్లకు సంబంధించి ప్రస్తుత ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి నాటి ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో గల్లీ గల్లీన మేము అధికారంలోకి వచ్చిన వారంలోపే సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని, ఎటువంటి ఆర్థిక బకాయిలు పెండింగ్లో ఉంచమని హామీలు ఇచ్చి ఇప్పటికీ ఐదేళ్లు ముగిస్తున్నప్పటికీ పాత పె న్షన్ విధానాన్ని అమలు చేయలేనీ , పెండింగ్ లో ఉన్న 21 వేల కోట్ల రూపాయలు ఆర్థిక బకాయిలు ఇప్పటికి చెల్లించలేనీ ప్రభుత్వాన్ని ఓటుతో ఇంటికి సాగనంపాలని జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి ఆవేదన వ్యక్తం చేశారు. తేదీ 31 .03. 2024 స్థానిక సలాం ఖాన్ ఎస్ టి యు భవనం నందు ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి గారు ఆనాడు ప్రతిపక్ష నేతగా అధికారంలోకి రాకముందు పాదయాత్రలో గల్లీ గల్లీన మేము అధికారంలోకి వచ్చిన వారంలోపే సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి, మేనిఫెస్టోలో చేర్చి ఓట్లు వేయించుకొని, అధికారంలోకి వచ్చి ఇప్పటికీ ఐదు సంవత్సరాలు అవుతున్నప్పటికీ సిపిఎస్ ను రద్దు చేయకపోగా దాన్ని స్థానంలో దుర్మార్గమైన జిపిఎస్ను తీసుకురావడం పట్ల ఉద్యోగులు ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అదేవిధంగా ఉద్యోగస్తులకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలను పెండింగ్లో ఉంచమని చెప్పి నేడు సుమారు 21 వేల కోట్ల రూపాయలను పెండింగ్లో ఉంచడం మాట తిప్పి మడమ తిప్పడమే అన్నారు. ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 117 వలన సుమారు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల విద్యార్థులు బడుగు బలహీన మైనార్టీ విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యారన్నారు. ఇచ్చిన హామీ మేరకే సిపిఎస్ ను రద్దు చేసి ,పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఆర్థిక ప్రయోజనాలు అన్నింటిని వెంటనే చెల్లించాలని, జీవో నెంబర్ 117 ను వెంటనే రద్దు చేయాలని మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .లేని పక్షంలో ఏప్రిల్ లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో ఉన్న 11 లక్షల ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల వారి కుటుంబాలు కలిసి 65 లక్షల మంది ఓటు అనే వజ్రాయుధంతో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామన్నారు ఈ కార్యక్రమంలో గోవిందు గోవింద నాయక్ వెంకటరాముదు భూషణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీ రామారావు కుటుంబానికి ,మా కుటుంబానికీ ఆప్తులు బీవీ కుటుంబం-వారి సేవలు కొనసాగించటానికి బీవీ జయ నాగేశ్వరరెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇచ్చాం

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు : కర్నూలు జిల్లా,ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం స్థానిక తేరు బజార్‌లో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభకు జాతీయ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాకతో పసుపు మయంగా మారిపోయింది.ఎమ్మిగనూరులోని స్థానిక వెంకటాపురం దగ్గర ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుండి అన్నమయ్య సర్కిల్, శివసర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస సర్కిల్ మీదుగా తేరుబజార్‌ల్లో ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభకు చేరుకుని ముందుగా కీ.శే. బీవీ మోహన్ రెడ్డిని గుర్తు చేసుకుంటూ ఎన్టీ రామారావు కుటుంబానికి,మాకుటుంబానికీ అత్యంత ఆప్తులు బీవీ కుటుంబం అని కొనియాడారు. నియోజక వర్గానికి ఎన్నోసేవలు అందించి, ఎమ్మిగనూరుతో అవినాభావ సంబంధమున్న వ్యక్తి కీ.శే.బీవీ.మోహన్ రెడ్డని, అందుకే వారి సేవలు అలానే కొనసాగించటానికి బీవీ జయ నాగేశ్వరరెడ్డికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇచ్చానని, అందుకే ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో గెలిపించి, నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో పెట్టే భాధ్యత ప్రజలుగా మీదే అన్నారు. అలాగే నిజమైన సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యమని కురుబ సామాజిక వర్గానికి చెందిన పంచాలింగాల నాగరాజుకు కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఇచ్చానని అన్నారు. అందుకే వారి ఇద్దరిని ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సామాజిక న్యాయం అంటే ఏమిటో చేసి చూపించే పార్టీ టీడీపీ పార్టీ అని, భూటకాలు, నాటకాలు ఆడుతున్న పార్టీ వైఎస్సార్ సీపీ పార్టీ అని ఎద్దేవ చేశారు. ఎన్నికలు లాంఛనమే అని, రాష్ట్రం లో అధికారంలోకి వచ్చేది టీడీపీ పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నో సభలు చూశానని, ఎమ్మిగనూరు ప్రజాగళంలో మండే ఎండల్లో ఎనలేని అభిమానం తో ప్రజల ఉత్సాహాన్ని నా జీవితంలో చూడలేదన్నారు.ఈ ఉత్సాహం చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలు, ముక్కలు అయిపోయి డస్ట్ బిన్ లోకి పోవడం ఖాయమన్నారు. నమ్మినోళ్ళను నట్టేట ముంచిన దుర్మార్గుడు, నమ్మించి గొంతు కోసే రకం జగన్ అన్నారు. ఎందుకూ పనికరాని దద్దమ్మ ఫేక్ ఫెలో ముఖ్యమంత్రి అని విమర్శించారు.హూ కిల్డ్‌బాబాయ్ అని పదే,పదే ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. చంపిన అవినాష్‌రెడ్డికి ఎంపీ సీటు అని, చచ్చిపోయిన బాధితులకు జైలు పరీక్ష తో సొంత చెల్లెలు పైనే కేసులు పెట్టి, సొంత నాన్న సాక్షి గా అబద్ధాలు చెప్పిన ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాయలసీమ లో ఇంత మంది ఎమ్మెల్యే లను గెలిపించారు, ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఒక్క రూపాయి అయినా ఖర్చు పెట్టాడా అని ప్రశ్నించారు.ప్రత్యేక రాయలసీమకు నీళ్ళు ఉంటే రతనాల పండించే రైతులు ఇక్కడున్నారని, అన్ని ప్రాంతాల్లో కంటే నీళ్ళు లేకుండా వెనుకబడిన ప్రాంతం కర్నూలు పార్లమెంట్ అన్నారు. కర్నూలు జిల్లా లో ఎక్కువగా పేద, బడుగు బలహీన, చేనేత వర్గాల వారున్నారని, వారికి టీడీపీ కి ఉన్న అనుబంధం అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి, అదే మాదిరిగా సోమ్ నాథ్ ఇద్దరూ ఎమ్మిగనూరు అభివృద్ధి కి సేవలందించాలని అన్నారు. చేనేతల కు హ్యాండ్ లూం ఉంటే రెండువందల యూనిట్స్ వరకు,పవర్ లూమ్ ఉంటే ఐదువందల వరకు ఉచిత కరెంట్ ఇస్తామని, బుడగ జంగాల ను కూడా ఎస్సీ లోకి చేరుస్తామని, చేనేతలకు ప్రత్యేక కార్పొరేషన్ ల ద్వారా ఆర్థిక సహాయం చేస్తామన్నారు. టెక్స్ టైల్స్ పార్క్ పెడితే దుర్మార్గులు అన్యాయం చేశారని, మళ్ళీ టీడీపీ అధికారంలోకి రాగానే టెక్స్ టైల్స్ పార్క్ తెస్తామని, ఎమ్మిగనూరు కేంద్రంగా చేనేత పరిశ్రమ పెడతామని అన్నారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చుటకు కృషి చేస్తామని, ఎస్సీల్లో వర్గీకరణ చేపడతామని తెలి పారు. అన్ని వర్గాల వారిని జగన్ నాశనం చేశాడని విమర్శించారు.ఈ రాష్ట్రం లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పొత్తులు ఉండాలని చెప్పిన మొదటి వ్యక్తి పవన్ కళ్యాణ్ అని, అందుకే బిజెపి, జనసేన, టీడీపీ ఉమ్మడిగా రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని పొత్తు పెట్టుకున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే మొట్ట మొదటి సంతకం మెగా డిఎస్సీ పైనే ఉంటుందని తెలిపారు.

జీవనోపాధికై వెళ్లి వస్తుండగా ఇద్దరు మహిళలు దుర్మరణం

విశాలాంధ్ర-తుగ్గలి : మండల కేంద్రమైన మద్దికెర లోని కొంతమంది కూలీలు తమ గ్రామం వదిలి ఇతర గ్రామాలకు కూలి నిమిత్తం వెళ్లి వచ్చేవారని అయితే దినచర్యలో భాగంగా ఆదివారం కూడా చిప్పగిరికి మిరపకాయలు తెంపడానికి వెళ్లి తిరుగువచ్చే ప్రయాణంలో తమ గ్రామ మద్దికేర సమీపంలోకి చేరుకోగానే తాము ప్రయాణించే టాటా ఏసీ వాహన ముందర టైరు పేలడంతో అదుపుతప్పి ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.ప్రమాదం జరగడంతో ఇద్దరు మహిళలు గొల్ల సంజమ్మ 50,ఆదిలక్ష్మి 45, అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని విచారించగా వాహనం లో 26 మంది ప్రయాణిస్తున్నట్లు అందులో ఇద్దరు మృతి చెందగా ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు మరో 17 మందికి గాయాలైనట్లు తెలిపారు. గాయాలైన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంతకల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.ఈ ప్రమాదాన్ని ఎస్ ఐ రమేష్ బాబు తమ పరిగణిలో తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఉపాధి పనులు లేక గ్రామంలో పనులు దొరక్క ఇక్కట్లు పడుతున్న ఉపాధి కూలీలు తమ జీవనోపాధికై గ్రామ వదిలి వెళ్ళవలసి వస్తుందని తెలిపారు.

క్షత గాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రమాద ఘటన విషయం తెలుసు కున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి హుటా హుటిన కర్నూలు నుంచి బయలుదేరి గుంతకల్లు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి మృతి చెందిన గొల్ల సంజమ్మ, ఆదిలక్ష్మిని, క్షతగాత్రులను పరామర్శించి అక్కడ నుంచి లైఫ్ లైన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మరికొంత మంది బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన సంఘటన గురుంచి ఎమ్మెల్యే వైద్యాధి,కారులను అడిగి తెలుసుకున్నారు. గాయాలైన వారికి మెరుగైన వైద్యం అం దించాలని వైద్యాధికారులను సూచించారు. ఈఘటనలో పొట్టకూటి కోసం వెళ్లి మృతి చెందడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరామర్శ లో ఎమ్మెల్యే వెంట మద్దికెర మండల వైఎస్ఆర్ పార్టీ నాయకులు, ఉన్నారు.

వరుస ప్రమాదాలతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

జిల్లాలో జరుగుతున్న బొలెరో, టాటా ఏసీ వాహనాల వరుస ప్రమాదాలపై పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఆలూరు,మద్దికేర వరుస ప్రమాదాలు జరగడంతో అందులో కొందరు మృతి చెందిన విషయము అందరికి తెలిసిందే. దీంతో జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రమైన తుగ్గలి లో ఆదివారం రాత్రి తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన డ్రైవర్లు వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం అతివేగంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని డ్రైవర్లకు హెచ్చరించారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు,సోమవారం 01, ఏప్రిల్ 2024

ఉచిత యోగ శిక్షణ సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : నంద్యాల పట్టణం శ్రీనివాస్ నగర్ మున్సిపల్ పార్క్ నందు గల ఆయుష్ యోగ కేంద్రం నందు ఏప్రిల్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు అనగా సోమవారం ఉదయం 5.20నుండి 6.30 వరకు యోగ శిక్షణ తరగతులు ప్రారంభం అవుతున్న సందర్భంగా ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయుష్ యోగా నిర్వాహకులు ఖండే ఆనంద్ గురూజీ తెలిపారు. శిరివెళ్ల లోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ కాలం లో ఆసనములు, ప్రాణాయామం, ఎక్సర్ సైజులు, క్రియలు, ధ్యానం నేర్పబడునని నడుము నొప్పి, ఉబకాయం, బీపీ షుగర్,థైరాయిడ్, పిసిఒడి, గ్యాస్ ట్రబుల్, అల్సర్, ఎసిడిటి, మలబద్దకం ఇలా అనేక రకాల సమస్యలతో బాధపడుతున్న వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకోని వైద్య పరీక్షలు చేపించి, వారి సమస్యలు తొలగించుటకు గ్రూపులవారీగా చేసి వారికీ తగ్గ ఆసనాలు క్రియలు ప్రాణాయామం చేయించడం జరుగుతుందన్నారు శిక్షణ అనంతరం మరల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగును. క్రింద కూర్చొలేని వారికీ బల్లలు ఏర్పాటు చేయడమైనది అన్నారు. ఎటువంటి లాభపేక్ష లేకుండా యోగా అనంతరం ప్రతిరోజూ ఉదయం కూరగాయల రసం మరియు 20రకాలతో కూడిన పండ్లు, కూరగాయలు, మొలకత్తిన గింజలు, డ్రై ఫ్రూట్స్ తో అమృత ఆహారం మరియు సాయంత్రం 7.30 కి 10రకాల సీజనల్ ఫ్రూట్స్ ఇవ్వబడునని తెలిపారు కావున స్త్రీ పురుషులు అందరు కుటుంబ సమేతంగా హాజరు కాగలరని తెలిపారు. మరిన్ని వివరములకు మరియు పేరు నమోదు చేసుకొనుటకు 9989983673 కు పోన్ చేసి తెలపాలని సూచించారు.

నవోదయలో సత్తాచాటిన విద్యార్థులు

విశాలాంధ్ర-దేవనకొండ: నవోదయ కేంద్రీయ విద్యాలయ ఫలితాలలో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు సీటు సాధించారు. మండల కేంద్రమైన దేవనకొండకు చెందిన రెయిన్బో పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్,ఆస్పరి నారాయణ పాఠశాలకి చెందిన విద్యార్థిని చరిత ఎంపికైనట్లు ఆదివారం వచ్చిన ఫలితాలలో వారు సీటు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు విద్యార్థులు నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో చంద్రబాబుకు ఎస్సీలు బుద్ధి చెప్తారు-ఎమ్మెల్యే గంగుల

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: ఈఎన్నికల్లో ఎస్సీలు బాబుకు బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో ప్రైవేటు ఎస్సీ డ్రైవర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగనమల ఎన్నికల యాత్రలో వైసీపీ అభ్యర్థి ట్రిప్పర్ డ్రైవర్ అని హేళనగా మాట్లాడారన్నారు. చంద్రబాబు మనస్తత్వాన్ని ప్రజలు గమనించాలన్నారు. సింగనమల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చదువుకున్న విద్యావంతుడని డ్రైవర్‌గా పని చేశారని ప్రజలతో మంచిగా ఉన్న వ్యక్తి కాబట్టే తమ నేత జగన్మోహన్ రెడ్డి ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేసారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 2017 నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా నేను వేసిన రోడ్లు, వీధిలైట్లు, అభివృద్ధి చూసి ప్రజలు ఓట్లు వేయాలని చెప్పడం జరిగిందన్నారు. పేదవారికి రాజకీయాలు అవసరమా అని ఆయన మాట్లాడడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రం ఎస్సీ,ఎస్టీల మీద ఎంతో ప్రేమ ఉన్నట్లు నటిస్తారన్నారు. పేదవారు కూడా అందలం ఎక్కాలని కులమత బేధాలు లేకుండా రాజకీయంగా అందరూ ఎదగాలని మా నేత జగన్మోహన్ రెడ్డి సింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్సీలకు టికెట్ ఇవ్వడం జరిగిందన్నారు. దానిమీద ఆయన హేళనగా మాట్లాడడం జరిగిందన్నారు. డ్రైవర్లు అంటే చులకనగా మాట్లాడడం తగదన్నారు. వాలంటీర్ వ్యవస్థను విమర్శించిన ఆయన తిరిగి వాలంటీర్లపై ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. అవ్వ తాతలకు పెన్షన్ వాలంటీర్లు ఇవ్వకుండా తిరిగి గ్రామ సచివాలయాల వద్దకే వెళ్లి తెచ్చుకునేలా కుటిల రాజకీయాలు చేశారన్నారు. పెత్తందారుల తరఫున చంద్రబాబు పేదల తరఫున వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని ప్రజలు ఆలోచించాలన్నారు. చంద్రబాబు చిల్లర రాజకీయాలను ప్రజలు గమనించాలన్నారు. ప్రైవేటు డ్రైవర్ల సంఘం తరఫున మాదం కిషోర్ మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీల మీద ఎందుకంత కోపమని మేము రాజకీయాల్లో కి రావడం ఆయనకు ఇష్టం లేనట్టుగా ఉన్నట్టుందన్నారు. డ్రైవర్లను అంత చులకన చేసి మాట్లాడడం తగదన్నారు. రాబోయే ఎన్నికల్లో డ్రైవర్లు ఎస్సీలు ఆయనకు బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో ప్రైవేట్ డ్రైవర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

జోరుగా వైసీపీ ప్రచార పర్వం

విశాలాంధ్ర-కోసిగి : మండల పరిధిలోని కామన్ దొడ్డి, కందుకూరు, కడిదొడ్డి గ్రామాల్లో ఆదివారం వైసీపీ మండల ఇన్చార్జి మురళి మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ బెట్టన్నగౌడ్‌ల ఆధ్వర్యంలో జోరుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు నాలుగవ రోజు గ్రామాల్లో ప్రచారం నిర్వహించామన్నారు. ప్రతి గడపగడప తిరిగి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకుంటూనే గ్రామాలు నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. బడుగు బలహీన వర్గాలను చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పట్టించుకోలేదన్నారు.మీఅమూల్యమైన రెండు ఓట్లలో ఒకటి ఎమ్మెల్యే అభ్యర్థి బాలనాగిరెడ్డికి , మరో ఓటు ఎంపీ అభ్యర్థి బివై రామయ్యకు వేసి వైసిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకో రావాలన్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎంపీపీ పెండేకల్లు ఈరన్న , కోసిగయ్య , శ్రీనివాస్ రెడ్డి , జగదీష్ స్వామి , కామన్ దొడ్డి నరసింహులు ,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - నంద్యాల: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కార్యవర్గ సమావేశము స్థానిక జిల్లా కార్యలయము జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రప్ప అధ్వర్యంలో జరిగింది. జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా, అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా అధ్యక్ష, కార్యదర్శి, కార్యవర్గసభ్యులు, సిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సంఘం అదేశానుసారం 2024 సభ్యత్వ నమోదు, ఖాళీగా ఉన్న అసోసియేట్ అధ్యక్షులుగా హరిని, జిల్లా కార్యదర్శిగా యస్. తిరుపాలయ్య, కోశాధికారిగా బి.శ్రీనివాసులును ఎన్నుకోవడం జరిగినది. జిల్లా లో వివిధ సంఘాలతో ఐక్యవేదిక ఏర్పాటు చేయుట గురించి చర్చించారు. అసోసియేట్ అధ్యక్షులు శ్రీహరి, జిల్లా కార్యదర్శి ఎస్.తిరుపాలయ్య, కోషాధికారి బి.శ్రీనివాసులు, జగదీశ్వరప్ప సిటీ అధ్యక్షులు సత్యం, కార్యదర్శి శ్రీనివాసులు కోయిలకుంట్ల తాలూకా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళా నాయకురాలు లక్ష్మి దేవమ్మ, ఖుష్నూర్ పాల్గొన్నారు.

చంద్రబాబు తోనే ప్రజా పాలన సాధ్యం

విశాలాంధ్ర - కల్లూరు: చంద్రబాబు తోనే ప్రజా పాలన సాధ్యం అవుతుందని టీడీపీ ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి అన్నారు. ఈమేరకు ఆదివారం డా.బైరెడ్డి శబరి సమక్షంలో కల్లూరు మండలానికి చెందిన యువకులు టీడీపీలో భారీగా చేరారు. కల్లూరు అర్బన్ వార్డులు గణేష్ నగర్, శరీన్ నగర్, వీకర్ సెక్షన్ కాలని, చెన్నమ్మ సర్కిల్, కృష్ణా నగర్ ప్రాంతాలతో పాటు ఓర్వకల్లు మండలం బైరాపురం గ్రామానికి చెందిన దాదాపు 800 మంది యువకులు, మహిళలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.శబరి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో సైకో పాలన సాగుతుందన్నారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. వైసీపీ పాలనలో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల్లేక ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. శివ, ఈశ్వర్, జయరాం, లక్కీ, నారాయణ, మధు, రామ కృష్ణారెడ్డి, శీను, పరమేష్, వెంకటాద్రి, తిరుమల్ తో పాటు వారి మిత్ర బృందం తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ఓడిస్తాం

విశాలాంధ్ర- వెల్దుర్తి: మార్చి 30న గుంటూరులో జరగాల్సిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర మండల స్థాయి కార్యవర్గ సమావేశం బరుపుకోవాడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం,పోలీసులుఅనుమతిని నిరాకరించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్లోని అన్ని జిల్లాల కేంద్రంలో సమావేశంనిర్వహించాలని పిలుపునిచ్చింది. వెల్దుర్తి పట్టణంలో పార్టీ ఆఫీసులో విలేకరుల సమావేశం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాయకంటి దేవరాజు మాదిగ ఆధ్వర్యంలో సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులురెడ్డి పోగు భాస్కర్, మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాదిగ, ఉప కులాల చివరి ఆకాంక్ష ఈ పోరాటంలో భాగంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30 ఏళ్ల నుండి అలుపెరుగని పోరాటం చేస్తుంది వారు గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి సీఎం అయినప్పటి నుండి ఐదేళ్లు అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణ గురించి వ్యతిరేకంగా మాట్లాడడం వర్గీకరణ జరగదని శాసనసభలో మాట్లాడడం చివరి దశగా సుప్రీంకోర్టులో విచారణ వచ్చినప్పటికీ అన్ని రాష్ట్రాల నుండి లాయర్లను నియమించడం జరిగింది. అయినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి లాయర్ నియమించకపోవడం మాదిగలను మరియు ఉప కులాలను కించపరచడమే అని వారు అన్నారు.

ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్: పట్టణంలోని పలు చర్చిలలో, ఇందిరానగర్ పరిశుద్ధ తోమా సిఎస్ఐ సంఘంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు చనిపోయి మూడో రోజు పునరుత్థానం సందర్భంగా ఈస్టర్ పండుగను నిర్వహించారు. పరిశుద్ధ తోమా దేవాలయంలో సంఘ కాపరి రెవరెండ్ ఐజాక్‌బాబు ఏసుక్రీస్తు పునరుత్థానముకు సంబంధించిన సందేశం వివరించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో సీఎస్ఐ చర్చి యూత్ ఆధ్వర్యంలో రంగులు చల్లుకునే కార్యక్రమం ప్రారంభించారు. ఈస్టర్ సందర్భంగా రంగులు చల్లుకులే కార్యక్రమాన్ని యూత్ రంగులు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ, పరుగెత్తుతూ సంతోషంగా, ఉల్లాసంగా గడిపారు. రంగులు చల్లుకునే కార్యక్రమం సందర్భంగా డ్రమ్స్ వాయిస్తూ వీధులు, ఇంటింటికి తిరిగారు. రంగులు చల్లుకునే కార్యక్రమంలో యూత్‌తో పాటు మహిళలు చిన్నపిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆలూరు : ఈస్టర్ పండుగ వేడుకలు ఆదివారం ఆలూరు పట్టణం లోని ఆర్ సీఎం,హొసన్నా ,హెూ రేబు మందిరాలలో పాటు మండలంలోని ఎం.కోట్కాల, హత్తిబెలగల్,మనేకుర్తి,హులేబీడు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలూరు సిఎస్ఐ చర్చ్‌లో పాస్టర్ రెవరెండ్ పాల్ బెనోహర్ బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువలో మరణించి మూడోరోజు తిరిగి లేచిన రోజును యావత్ దేశం ఈస్టర్ పండుగగా జరుపుకుంటారన్నారు. ఆలూరు సిఎస్ ఐ చర్చ్ పాస్టర్ రెవరెండ్ పాల్ బెనోహర్ అన్నారు. సంఘ కార్యదర్శి దేవదానం, కోశాధికారి సుకుమార్, సభ్యులు విజయ రాజ్, జాన్, రాజన్న, రాజశేఖర్, విజయ నిర్మల, జయమ్మ, వినోద్, చిన్న, ప్రభాకర్, విజయ్‌లు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ. 40 వేలు విరాళం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరులోని సీఎస్ఐ చర్చి నిర్మాణానికి గుంటూరు మిర్చి యార్డులోని విజయ కార్తిక్ మిర్చి ట్రేడర్స్ యజమానులు, పెద్దకడబూరుకు చెందిన కాంగ్రెసు పార్టీ జిల్లా కార్యదర్శి కురువ గుడిసె నరశింహులు సంయుక్తంగా రూ. 40 వేలు నగదును ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు సంఘ పెద్దలకు అందజేశారు. గుంటూరు మిర్చి యార్డులోని విజయ కార్తిక్ మిర్చి ట్రేడర్స్ యజమానులు రూ. 30 వేలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కురువ గుడిసె నరశింహులు రూ. 10 వేలు సీఎస్ఐ చర్చి నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు కానుక ఇచ్చిన దాతల గురించి ప్రత్యేక ప్రార్థన చేశారు.

దళిత వీరాంజనేయులకు క్షమాపణ చెప్పాల్సిందే - ఎమ్మెల్యే శ్రీదేవి

విశాలాంధ్ర- వెల్దుర్తి : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గత మూడు రోజుల క్రితం అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం వర్గానికి వచ్చి ఒక బహిరంగ సభలో జనాల మధ్యన ఒక దళిత వైసిపి అభ్యర్థి వీరాంజనేయులుపై ఒక ట్రిప్పర్ డ్రైవర్ అని అవహేళన చేయడం చాలా బాధాకరమని పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలోని తన స్వగృహమునందు విలేకరులతో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మాదిరిగా టిడిపిలో ఎవరు సంపన్నులు అయితే వారికి సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితులలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అంటూ చాలా హేళనగా మాట్లాడిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు నాయుడేనన్నారు. బీసీలను తోకలను కత్తరిస్తానంటూ బెదిరిస్తూ అనగారస్తు ఆయన ప్రభుత్వంలో మాట్లాడిన మాటలు చాలా బాధించాయన్నారు. దళిత మహిళకు హెూమ్ మినిస్టర్ పదవి ఇచ్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డిదేన న్నారు. బీసీలను క్యాబినెట్ లోకి తీసుకొచ్చి అనేక గొప్ప పదవులు ఇచ్చిన ఘనత కూడా జగన్ మోహన్ రెడ్డికె దక్కిందని కొనియాడారు. నా ఎస్సీ నా ఎస్టి నా బీసీ నా ముస్లిం మైనార్టీలంటూ పెద్దపీట వేశారన్నారు. టిప్పర్ డ్రైవర్ ను పట్టుకొని అవహేళన చేశావు కదా చంద్రబాబు మా సింగనమల నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు విద్యావంతుడు మంచి గుణవంతుడు అలాంటి వ్యక్తిని అవహేళన చేయడం చాలా విడ్డూరమన్నారు. పెద్ద చదువులు చదివి నీవల్ల నీ ప్రభుత్వం వల్ల ఉద్యోగాలు రాక టిప్పర్ డ్రైవర్లు అయ్యారు.చంద్రబాబు పేదల బాధలు రైతన్న బాధలు గ్రామాలలో అభివృద్ధి పనులు జరగాలన్న ఒక జగనన్నకి సాధ్యమన్నారు. టిప్పర్ కు ఎంత బలం ఉంటదో గ్రహించాలి సైకిల్ కు ఎంత బలం ఉంటాదో నీవు తెలుసుకోలేకపోయావు టిప్పర్ వచ్చి సైకిల్ ను గుద్దితే ఎక్కడపడతాదో గుర్తుంచుకో చంద్రబాబు నీవు అది గ్రహించలేకపోయావు జూన్ 4వ తేదీ ఆ టిప్పర్ వచ్చి సైకిల్ ని గుద్దితే ఎక్కడ పడుతుందో చూసుకో, 175 కి 175 సీట్లు గెలవడం, 25 ఎంపీలకు 25 ఎంపీలు గెలవబోతున్నాం. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రవి రెడ్డి, కొత్తూరు వెంకటేశ్వర్ రెడ్డి, అల్లు గుండు శ్రీరామ్ రెడ్డి,జగన్మోహన్ రెడ్డి, నర్సాపురం కృష్ణారెడ్డి, పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిర్ణయం ఆశ్చర్యమనిపిస్తుంది- ఎమ్మెల్యే శిల్పా

విశాలాంధ్ర - నంద్యాల: ఎన్నికల కమిషన్ నిర్ణయం ఆశ్చర్యమనిపిస్తుందని, వృద్దులకు, వికలాంగులకు, వితంతువులకు ఒక్కటో తారీఖునే ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇస్తున్న వాలంటీర్లను తప్పించడం బాధాకరంగా ఉందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శిల్పా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుట్ర పూరితంగానే వాలంటీర్ వ్యవస్థపైన దాడి చేస్తుందని ఆరోపించారు. మాజీ ఎన్నికల కమీషనర్ నిమ్మగడ్డ రమేష్ ద్వారా వాలంటీర్ వ్యవస్థ పైన ఎన్నికల కమిషనర్‌కు పిర్యాదు చేయిస్తున్నారని, వాలంటీర్లను తప్పించి అవ్వ తాతలకు వికలాంగులకు, వితంతువులకు మోసం చేస్తున్నారని శిల్పా రవి తెలుగు దేశం నాయకులపైన మండి పడ్డారు. తెలుగుదేశం, జనసేన బీజేపీ నాయకులు ఏమొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని రవి ప్రశ్నించారు. పెన్షన్ లు పంపిణీ చేయకుండా చూస్తున్న తెలుగు దేశం నాయకులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.టీడీపీ అధికారం చేపడితే వాలంటీర్ వ్యవస్థ పైన దాడి చేస్తారు అనడానికి ఎన్నికల కమిషనర్ చర్యద్వారా మరోసారి తెలిసిపోయిందాన్నారు. శింగనమలలో వైసీపీ తరుపున పోటీ చేస్తున్న వీరాంజనేయులును కించపరిచేలా చంద్రబాబు నాయుడు మాట్లాడటాన్ని శిల్పా రవి ఆక్షేపించారు. నంద్యాలలో వ్యాపారులు వ్యాపారం చేసుకున్న తరువాత రాత్రి తమ సంపాదనను ఇంటికి తీసుకెలుతున్న వారిపైన ఎన్నికల కోడ్ పేరుతో వారి డబ్బులను సీజ్ చేయడం పట్ల ఆలోచించాలని ఎమ్మెల్యే అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఏసయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి - ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నంద్యాల: ఈస్టర్ పర్వదినాన ఏసయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయంలో ఈస్టర్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, కౌన్సిలర్ ఎద్దు మనోరంజని, రాష్ట్ర వైఎస్ఆర్సిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యదర్శి కారు రవికుమార్, స్థానిక చర్చి పెద్దలు ఇమ్మానియేల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో అందరము అనేక ఇబ్బందులు పడ్డామని, దేవుని దయవల్ల నేడు జీవిస్తున్న అందరూ మరో కొత్త జీవితాన్ని ప్రారంభించామని, ఇదంతా భగవంతుని దీవెనలు ఆశీస్సులు మనందరిపై ఉండడంవల్లనే జరిగిందన్నారు. ఈస్టర్ పండుగ జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి ఆ యేసయ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఉండాలని కోరారు. మీ అందరి ఆశిస్సులు దీవెనలు శిల్పా కుటుంబంపై చూపిన ప్రేమ అభిమానాలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. రానున్న రోజుల్లో మీ అందరి ప్రార్థనలో జగనన్నను, తనను గుర్తు చేసుకోవాలని కోరారు. నంద్యాల ప్రజలందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో డా. మనోజ్ కుమార్, జర్నలిస్ట్ రాజు, ప్రభాకర్, సాల్మన్ రాజు, మన్యంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

విశాలాంధ్ర-హొలగుంద : సంక్షేమం కోసం ఎల్లవేళలా కట్టుబడి ఉన్నామని ఆలూరు వైకాపా అభ్యర్థి బి వీరపాక్షి అన్నారు శాలి మసీదులో ఆదివారం ప్రార్థనలు చేసి వైకాపా నాయకుడు భంగిడి బాష ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్ అండంగా నిలిచారని కొనియాడారు వైకాపా మండల కన్వీనర్ షఫీ ఉల్లా, శాలి షబ్బీర్లు మాట్లాడుతూ ఈదుగాకు ప్రహరీ గోడ నిర్మించాలని అలాగే ఖబర్సాన్ కు ప్రహరీ గోడ నిర్మించాలని ఈద్గాకు పట్ట ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు తప్పకుండా గెలిచిన తర్వాత హామీలను నెరవేరుస్తానని విరుపాక్షి స్పష్టం చేశారు ఇఫ్తార్ విందులో వైకాపా నాయకులు రఫీక్, ఆఫీస్, ముల్లా రామతుల్లా, ముతవల్లి శాలి ఫక్రుద్దీన్, శాలి మస్తాన్, ఖాసీం వలి, హెూ న్నూరు వలి, టీచర్ ఫక్రుద్దీన్ సాబ్, బీబీ వలి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మోమిన్ హుస్సేన్ సాహెబ్ కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్: మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో ఖబరస్తాన్ అంజుమన్ కమిటీ గౌరవ అధ్యక్షులు మోమిన్ షఫీవుల్లా, అధ్యక్షులు మోమిన్ ఇబ్రహీం ఖలిలుల్లా, ఉపాధ్యక్షులు నాయాబ్ సయ్యద్ అసదుల్లాలతో పాటు కమిటీ సభ్యులు భైరాపురం రహీం, సయ్యద్ ఖాదర్ బాష, సయ్యద్ షషా వలి, మోమిన్ ఖమ్రుద్దిన్, గౌర షబ్బీర్, పాన్ మహమ్మద్, మిద్దె జహంగీర్ బాష, పఠాన్ అమ్రుల్లా ఖాన్, మోమిన్ అహమ్మద్ హుస్సేన్, మోమిన్ జబివుల్లా, భైరాపురం షేక్ షా వలి, నూర్ మహమ్మద్, షేక్ రసూల్ మియా, కట్టుబడి మాబాష, లాలు వలి, ఖాద్రీ, రహమత్ ఖాన్ తదితరులు చేరారు. నాడు బుడ్డా, మోమిన్ కుటుంబాల మధ్య ఉన్న వైరాన్ని భుచిగా చూపి ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంక్ గా కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లు వాడుకొని వదులేశాయి తప్పా మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడింది ఏమి లేదని కమిటీ అధ్యక్షుడు మోమిన్ ఇబ్రహీం ఖలీలుల్లా పేర్కొన్నారు. గతంలో బుడ్డా, మోమిన్ కుటుంబాలు కలిసి ఉన్నప్పుడే ఆత్మకూరులో ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పనులు చేశారని గుర్తు చేశారు. తరువాత కాలంలో వచ్చిన వలస నాయకులు వైరాన్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకొని వెల్లారే తప్పా, మైనార్టీలకు, మోమిన్ కుటుంబానికి చేసింది ఏమి లేదని అన్నారు. మళ్ళీ రెండు కుటుంబాలు ఒక్కటైతేనే శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధి తోపాటు ముస్లిం మైనార్టీలకు అన్ని రకాలుగా మేలు జరుగుతుంది అని విశ్వసించి 35సంవత్సరాల చరిత్రలో తొలి సారి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం నియోజకవర్గం లో పాటు పడింది కేవలం బుడ్డా కుటుంబం, తెలుగుదేశం పార్టీనేనని అన్నారు. తమ స్వార్థం కోసం గత గాయాలను చూపి రెచ్చగొట్టి నాటి కాంగ్రెస్, నేటి వైసిపి నాయకులు పబ్బం గడుపుకుని వదిలేశారని అన్నారు. మళ్ళీ బుడ్డా, మోమిన్ కుటుంబాలు స్నేహపూర్వక కలయికతో ఆత్మకూరులో ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడతామని పేర్కొన్నారు.

ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన ఎన్ఎండి ఫరూక్

విశాలాంధ్ర - నంద్యాల: ఈస్టర్ పండుగ సందర్భంగా నంద్యాలలోని స్థానిక పెద్ద చర్చి, హొసన్న ప్రార్థన మందిరం, జ్ఞానాపురం చిన్న చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అక్కడ ఉన్నటువంటి ప్రజలకు నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఈస్టర్ సందర్భంగా చర్చిలో ప్రార్థన నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఈ ఈస్టర్ పండగను ప్రతి ఒక్కరు బాగా జరుపుకోవాలని అందరూ సుఖశాంతులతో ఉండాలని ఎల్లవేళలా ఆ ఏసుప్రభు మీకు తోడై ఉండాలని బిషప్ వరప్రసాద్ చేత ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది.

బెల్దోనలో అగ్నికి ఆహుతైన గడ్డివాములు
రూ.2 లక్షలు ఆస్తి నష్టం-ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు

విశాలాంధ్ర - చిప్పగిరి: మండల పరిధిలోని బెల్దోనలో మూడు గడ్డివాములు అగ్నికి ఆహుతి అవడంతో సుమారు రూ.2 లక్షల దాకా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిసింది. ఆదివారం గ్రామస్తులు బాధ్యతలు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని బెల్దోన గ్రామానికి చెందిన గొల్ల రాముడు, కోనంకి వెంకటేష్ లకు సంబంధించిన మూడు గడ్డివాములు అగ్నికి ఆహుతి పూర్తిగా ఖాళీ కాలి బూడిదైపోయాయి అన్నారు. ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పు అంటుకోవడంతో పక్కనే ఉన్న ట్రాక్టర్ ముందుకు తోచే సమయంలో ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలకు గురయ్యారన్నారు. గ్రామంలోని అగ్ని ప్రమాదంపై అనంతపురం జిల్లా గుంతకల్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చేలోపే గడ్డివాములన్నీ పూర్తిగా అగ్నికిఆహుతై కాలిబూడిదై పోయాయ న్నారు. సంవత్సరం పాటు కష్టపడి పశువుల కొరకు పశుగ్రాసం నిలువ ఉంచుకుంటే అగ్నికి ఆహుతై పోవడంతో పశువులను ఎలా బ్రతికించుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు పశుగ్రాసం అందించి రైతులను ఆదుకోవాలని ఉన్నతాధికారులకు గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

వాలంటీర్లపై అనిచిత వాఖ్యలు చేయడం తగదు

విశాలాంధ్ర- ఆత్మకూరు టౌన్: శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు విలేకరులతో మాట్లాడిన ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి ఎన్నికల కమిషన్ విడుదలైన నేపథ్యంలో మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదు అన్నారు అంతే కాకుండా వాలంటరీలు తమ విధులను సకాలంలో నిర్వహించడం ద్వారానే ప్రజలకు మేలు జరుగుతుంది అన్నారు వాలంటీర్లు సకాలంలో వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు సరైన సమయంలో పింఛన్ ఇస్తూ వారి యొక్క ఆరోగ్యాలను రక్షిస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర వేస్తున్న వారిని ఇలా వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు అంతేకాకుండా ప్రతిపక్ష టీడీపీ జనసేన బిజెపి పార్టీలు కలిసి వాలంటరీలను అనరాని మాటలని మళ్లీ మా ప్రభుత్వం వస్తే వాలంటీర్లను తీసేయము వాళ్ల సేవలను వృద్ధిలోకి తీసుకొస్తామంటూన్నారు అన్నారు ప్రభుత్వంలోకి రాక ముందుకు ఇన్ని మాటలు అనే వాళ్ళను మా ప్రజలు నమ్మరు అన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

సీఎంను కలిసిన ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి

విశాలాంధ్ర- కల్లూరు : దశాబ్దాలుగా శాంతి యుతంగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్న మాదిగలకు వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టి అన్ని విధాల ఆదుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డినిఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కమతం పరుశురామ్ కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా మాదిగల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాగా ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ తోనే మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విన్నవించడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించి మాదిగలకు అన్ని విధాలు న్యాయం చేస్తానని అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ అడ్డుకున్న బాబుకు బుద్ధి చెప్పండి

విశాలాంధ్ర - కోడుమూరు: సూర్యోదయం కంటే ముందుగానే మీ ఇంటికి వాలంటీర్లు వచ్చి,మీ తలుపు తట్టి పింఛన్ పంపిణీ పంపిణీ చేసే విధంగా వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి,వృద్ధుల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తూ పేదల పక్షపాతిగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అడ్డుకునేందుకు దారి లేక,ఎన్నికల కమిషన్ కు వాలంటీర్లపై ఫిర్యాదు చేసి పింఛన్ పంపిణీ అడ్డుకున్న చంద్రబాబు నాయుడుకు మీ యొక్క అమూల్యమైన ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక బుడగ జంగాల కాలనీలో వైసిపి నాయకులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బుడగ జంగాల,బుడబుక్కల,చెంచు జాతుల కాలనీ వాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగ వేడుకలు

విశాలాంధ్ర- పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట, కంబలదిన్నె, జాలవాడి, బసలదొడ్డి, కంబదహాల్, హెచ్ మురవణి, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో ఆదివారం క్రీస్తు పునరుత్థాన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతోజరుపుకున్నారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులో సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు, ఆర్సీఎం చర్చి ఫాదర్ సంజీవరావు ఆధ్వర్యంలో చర్చిలను పూలమాలలతో అలంకరించి తెల్లవారుజామున క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు సందేశమిస్తూ లోక కళ్యాణం నిమిత్తం యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి, మానవాళి పాపముల మిత్తం సిలువలో బలియాగమై సమాది చేయబడి తిరిగి మూడో రోజు సమాది నుంచి ఏసుక్రీస్తు తిరిగి లేచాడని గుర్తు చేశారు. ఈ పవిత్ర దినాన్ని ఈస్టర్ పండుగగా మనం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు అడుగు జాడలలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా చర్చిల సంఘ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.